
ప్రజాశక్తి
శనివారం 8 ఫిబ్రవరి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పరిశీలిస్తున్న అధికారిహుసేనమ్మ

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని కపాడిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని టెంకాయల స్ట్రీట్ సచివాలయం వీధి లో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా లార్వా సర్వేపిడిపి వర్క్, ఫీవర్ సర్వే కార్యక్రమాలను జిల్లా మలేరియా అధికారి ఈ.హుస్సేనమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో అనవసరపు నీటి నిల్వలు లేకుండా చూసుకొని దోమల పెరుగుదల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలని, స్తోమత ఉన్నవారు ఇంటికి మస్కిటో స్క్రీనింగ్ చేయించుకొని కీటక జనిత వ్యాధుల కు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పట్టణ పరిధిలో అక్కడక్కడ వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని, ఈ నేపధ్యంలో ప్రజలు దోమ కాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలలో పారిశుద్యం మెరుగుపరుచుకొని సీజనల్ వ్యాధులకు గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ యు ఓలు , ఆరోగ్య కార్యకర్త, ఆశలు పాల్గొన్నారు.

రామాయపట్నంలో భూముల వేట..!

రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం భూముల కోసం వేట మొదలు పెట్టింది. ఇప్పటికే పోర్టు, సోలార్ ఫ్యానల్స్, పరిశ్రమల ఏర్పాటు కోసం భారీగా భూములు స్వీకరించారు. తాజాగా ఇటీవల సుమారు రూ.95 వేల కోట్లు పెట్టుబడితో 5 వేల ఎకరాల్లో బిపిసిఎల్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయనే ప్రచారం సాగుతోంది. ఈ పరిశ్రమకు అనుబందంగా . రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలెక్టర్ ఆనంద్ ఇటీవల కలిసినప్పుడు మరో 10 వేల ఎకరాలు భూమి సేకరించాలని సూచన ప్రాయంగా చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ఇండస్ట్రీయల్ కార్యదర్శి ఎన్.యువరాజ్ రామాయపట్నం పోర్టు, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ ప్రాంతంలోని రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. పరిశ్రమలు రావాలని, తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలని నిర్వాసితులు ఆశిస్తున్నారు. 2004 నుంచి జిల్లాలో 75 వేల ఎకరాలు భూమి తీసుకొని, అందులో 25 వేల ఎకరాలు మాత్రమే వినియోగిస్తున్నారు అలాంటి కథ కాదు కథ అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- ◆ఇండస్ట్రీయల్ సెక్రటరీ రాక
- ◆ఇప్పటికే 9 వేల ఎకరాలు భూ సేకరణ
- ◆భారీగా భూ బ్యాంక్‌కు సన్నాహాలు
- ◆సోలార్, బిపిసిఎల్‌తోపాటు మరికొన్ని ప్రాజెక్టులు
- ◆పాత కథ పునరావృతం కాదు కథ..?



సర్వాయపాలెంలో కార్యదర్శి యువరాజు



కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న కార్యదర్శి యువరాజ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పారిశ్రామీకరణ జరగాలని జిల్లా ప్రజలు ఆశపడుతున్నారు. చదువు కున్న పిల్లలకు ఉద్యోగం, ఉపాధి లేక ఇళ్లవద్దే తల్లిదండ్రులకు భారంగా యువత మారుతోంది. ఇలాంటి సమయంలో పరిశ్రమలు వస్తే ఉద్యోగం వస్తుందని భావిస్తున్నారు. పరిశ్రమల పేరుతో ఒకప్పుడు ప్రభుత్వాలు జిల్లాలోని రైతాంగాన్ని, ప్రజలను తీవ్రంగా మోసం చేసింది. పెద్ద ఎత్తున భూములు సేకరించింది. అటు తరువాత పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా పెద్దలకు కట్టబెట్టింది. సాగుచేసి భూమిపోయి, చేసేందుకు పనిలేక అనేక మంది రైతులు ప్రస్తుతం కూలీలుగా మారిపోయారు. ఇందుకు కృష్ణపట్నం గ్రామమే పెద్ద ఉదాహరణ. 2006లో ఆ గ్రామంలోని 2550 ఎకరాలు రిలయన్స్ థర్మల్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం తీసుకొని ఆ సంస్థకు అప్పగించింది. ఇప్పటి వరకు థర్మల్ ప్రాజెక్టు పెట్టకపోగ ఆభూములు బీడుగా వారి వద్దే ఉంచుకున్నారు. రైతులు సాగు చేయడానికి పొలం లేక ఇతర ప్రాంతాలకు కూలీలుగా వెళుతున్నారు. ఇలాంటి కథలు జిల్లా వ్యాపితంగా అనేకం ఉన్నాయి.. తాజాగా రామాయపట్నం పోర్టు అభివృద్ధిపై ప్రభుత్వం పోకస్ పెడుతోంది. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం వద్ద భూమిని సద్వినియోగం చేసుకోలేదు. కొత్తగా కృష్ణపట్నంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. రామాయపట్నం వద్ద పోర్టు నిర్మాణం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ప్రయివేటు వ్యక్తులకు కాంట్రాక్టు అప్పగించడంతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. 2020లో ఇక్కడ ఇండో సోలార్ కంపెనీ ఏర్పాటు కోసం 1800 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చి సుమారు 5 వేల ఎకరాలు రైతుల నుంచి బలవంతంగా లాకున్నారనే విమర్శలున్నాయి. ఈ పరిశ్రమ జగన్‌మోహన్‌రెడ్డి సమీప బంధువులు అనే ప్రచారం జరుగుతోంది. రామా యపట్నం పోర్టుకు 850 ఎకరాలు, ఇండో సోలార్‌కు 5 వేల ఎకరాలు, బిపిసిఎల్‌కు 6 వేలు కాకుండా మరో 10 వేల ఎకరాలు సేకరించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆరు వేల ఎకరాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఇప్పటికే 9 వేల ఎకరాలు సేకరణ..!

రామాయపట్నం పోర్టు వద్ద సోలార్ ప్యానెల్ కంపెనీ కోసం ఆరు వేల ఎకరాలు, ఇతర అవసరాలకోసం మరికొంత సుమారు తొమ్మిది వేల ఎకరాలు తీసుకున్నారు. తాజాగా భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. పోర్టు సమీపంలో సుమారు 6 వేల ఎకరాల్లో రూ.95 వేల కోట్లతో దీనిని నిర్మాణం చేయనున్నారు. ఇది ఇప్పటి వరకు కాగితాలకే పరిమితమైంది. దుబాయు, ఖతర్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి రామాయపట్నం పోర్టుకు ఓడల ద్వారా క్రూడాయిల్ ఇక్కడకు తీసుకొస్తారు. దానిని శుద్ధిచేసే కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుచేస్తున్నారు. దక్షిణ భారత దేశంలో బిపిసిఎల్ ఏర్పాటు చేయనున్న భారీ పరిశ్రమ ఇదే కావడం విశేషం. ఇక్కడ నుంచి పైపులైన్ ద్వారా ఇతర ప్రాంతాలకు తీసుకెళతారు. విభజన చట్టంలోనే ఆయిల్ రిఫైనరీ (ప్రాజెక్టు) ఏర్పాటు చేస్తామని అప్పట్లో ప్రకటన చేశారు. పెట్రోకెమికల్ ప్లాంట్, లుబ్రికెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్, ఫ్యూయల్ అడిటివ్స్, వ్యాక్స్ ప్రొడక్షన్, ఆపాల్ట్ ప్రొడక్షన్, సర్ఫర్ రికవరీ ప్లాంట్, కెటలిస్ట్ మాన్యుఫాక్చరింగ్, రిఫైనరీ మెయింటెనెన్స్ సర్వీస్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎన్విరాన్ మెంటల్ సర్వీస్, ట్యాంక్ మాను ఫ్యాక్చరింగ్, పైప్ మాన్యుఫ్యాక్చరింగ్, వాల్వ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇన్సులేషన్ అండ్ రిఫ్రాక్టరీ సర్వీస్, లాజిస్టిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ వంటి 15 అనుబంధ పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ఉపాధి వస్తుందని చెబుతున్నారు.

ప్రభుత్వం భూముల కోసం వేట..!

రామాయపట్నం పోర్టును భారీ స్థాయిలో అభివృద్ధికి భారీగా ప్రకటనలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న భూములను మరో పది వేల ఎకరాలు సమీకరించనున్నారు. శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ ఎస్. యువరాజ్, కలెక్టర్ ఒ.ఆనంద్ ఆ ప్రాంతంలో పర్యటించారు. అలగాయపాలెంలో వ్యవసాయ భూములు పరిశీలించారు. కరేడు చెరువును పరిశీలించి ఆయకట్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెంకాయచెట్లపాలెం గ్రామంలోని భూములను చూసి, ప్రభుత్వ ప్రయివేటు భూమి ఎంత ఉందనే విషయం తెలుసుకున్నారు. కావలి రూరల్ మండలం, అనెమడుగు, చెన్నాయపాలెం భూములను చూశారు. ఇప్పటి వరకు ఎంత భూమి సేకరించారనే విషయం పరిశీలించారు. ఇండో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలించారు. ఏయే భూములు అనుకూలంగా ఉన్నాయి. ఎంత తీసుకోవాలనే విషయంపై స్థానిక అధికారులతో చర్చించారు. రైల్వే లైన్, దగదర్తి విమానాశ్రయం. 16వ నెంబర్ జాతీయ రహదారి, అందుబాటులో ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని పోర్టుకు భారీ భూ బ్యాంక్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పోర్టు, పరిశ్రమల ఏర్పాటుకోసం చేవూరు, రావూరు, సాలిపేట, చెన్నాయపాలెం, రుద్రకోట, ఆవుల వారిపాలెం, మొండివారి పాలెం, కర్లపాలెం గ్రామాల్లో భూసేకరణ చేశారు. ప్రస్తుతం చేస్తున్నారు. సోలార్, బిపిసిఎల్ ప్రాజెక్టులు వస్తే దానికి అనుబంధంగా భారీగా పరిశ్రమలు వచ్చే అవకాశాలున్నాయి. రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్టు

-56 బైక్‌లు స్వాధీనం



మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోటార్ సైకిళ్లను దొంగతనం చేసి పోలీసుల కళ్లు కప్పి తప్పించుకొని తిరుగుతున్న నలుగురు నిందితులను కొడవలూరు మండలం, పద్మనాభసత్రం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసు విచారణలో నిందితులు నేరచరిత్ర కలిగిన వారే అని, వారి వద్ద రూ.30 లక్షల విలువ చేసే పలు కంపెనీలకు చెందిన 56 మోటారు సైకిళ్లు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి జి.కృష్ణకాంత్ నిందితులకు సంబంధించి పూర్తి వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో మోటారు సైకిల్ చోరీలు గుర్తించిన కేసులు నమోదు కావడంతో ఈ దొంగల ఆటకట్టించేందుకు ఎస్‌పి ఆదేశాల మేరకు అడిషినల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య సూచనల మేరకు రూరల్ డిఎస్‌పి జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిసిఎస్ సిఐ సిహెచ్ సీతారామయ్య, బి.అశోక్‌కుమార్, కొడవలూరు సిఐ ఎ.సురేంద్రబాబు, ఎస్‌ఐ సిహెచ్ కోటిరెడ్డి, విడవలూరు ఎస్‌ఐ పి.నరేష్, వారి సిబ్బంది ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు ఇటీవల కాలంలో ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురువారం కొడవలూరు మండలం, పద్మనాభసత్రం ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పొంతన లేని సమాధానాలు ఇస్తున్న ఆవల శివ, కామంచి నాని, శ్రీరామ్ రవి, నల్లగుండ్ల హోసన్నలను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా అసలు వ్యవహారం బహిర్గతమైంది. ఆవల శివ 2017లో ఓ హత్య కేసులో పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై బయటకు వచ్చినట్లు గుర్తించారు. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన ఆవల శివ తన చిన్నమ్మ కుమారుడు శ్రీరామ్ రవి దుర్గతో కలిసి 25 మోటార్ల సైకిళ్లను చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. 2020లో శ్రీరామ్ రవి దుర్గను వెంకటాచలం పోలీసులు అరెస్టు చేసి 17 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. అప్పుడు శ్రీరామ్ రవి పోలీసులకు ఇచ్చిన వాగ్మూలం మేరకు అల్లూరు పోలీసులు ఆవల శివను అదుపులోకి తీసుకొని 8 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో అప్పటికే మోటారు సైకిల్ దొంగలుగా పేరు పొందిన కామంచి నాని, నల్లగుండ్ల హోసన్నలతో పరిచయం కావడంతో నలుగురు ఒక గ్రూపుగా ఏర్పడి జిల్లాలో 24, తిరుపతి జిల్లాలో 21, ప్రకాశం జిల్లాలో 8, బాపట్ల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో ఒక్కొక్క మోటార్ సైకిల్ దొంగతనం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో అంగీకరించారు. చోరీ చేసిన మోటారు సైకిళ్లలో కొన్ని అమ్మగా, మరికొన్ని వారి వద్దనే ఉంచినట్లు గుర్తించామన్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభను కనపరిచిన పోలీసు సిబ్బంది ఎస్‌పి రివార్డులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నగర డిఎస్‌పి పి.సింధుప్రియ, సిపిఎస్ పోలీసు సిబ్బంది, కొడవలూరు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ నెల్లూరు ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు చెందిన ప్రధాన సమస్యలను, ప్రమోషన్ల సమస్యను, సిబ్బంది కొరత తదితర సమస్యలను ఎన్‌జిఒ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఎన్జీవో సంఘం నాయకులు తమ సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పెంచల రావు, గాదిరాజు రామకృష్ణ, ఎన్‌జిఒ నాయకులు, , సిబ్బంది పాల్గొన్నారు.



ఉలవపాడులో భూములను పరిశీలిస్తున్న పరిశ్రమల, వాణిజ్య శాఖల కార్యదర్శి ఎన్. యువరాజ

పరిశ్రమల స్థాపనకు భూములు పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లూరు/కందుకూరు/ఉలవపాడు

నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమల స్థాపనకు చెందిన భూములను రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖల కార్యదర్శి ఎన్. యువరాజ్ శుక్రవారం పోర్టు పరిసర ప్రాంతాల్లోని భూములను కలెక్టర్ ఒ ఆనంద్ తో కలసి పరిశీలించారు. తొలుత జిల్లా పర్యటనకు విచ్చేసిన పరిశ్రమల వాణిజ్య శాఖల కార్యదర్శి ఎన్. యువరాజ్ కు కలెక్టర్ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం అలగాయపాలెం వ్యవసాయ భూములను పరిశీలించారు. కరేడు చెరువును పరిశీలించి ఆయకట్టు వివరాలను తెలుసుకున్నారు. చెరువులో నీరు సమృద్ధిగా ఉండటం చూసి వర్షాధారం లేక ప్రాజెక్ట్ ద్వారా నీరు నింపారా అని విచారించారు. అనంతరం టెంకాయచెట్లపాలెం గ్రామ పరిధిలోని భూములను పరిశీలించారు. మ్యాపుల సహాయంతో ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను కలెక్టర్ వివరించారు. అనంతరం కావలి రూరల్ అనెమడుగు గ్రామ పంచాయతీ లోని సర్వాయపాలెం, అనెమడుగు గ్రామాల భూములను పరిశీలించారు. ఇప్పటికే వివిధ పరిశ్రమలకు కేటాయించిన భూమి వివరాలను ఆరా తీశారు. అనంతరం చెన్నాయపాలెం భూములను పరిశీలించి నేరుగా రామాయపట్నం పోర్టు కు చేరుకున్నారు. పోర్టు పరిధిలో నిర్మాణంలోని ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ ను సందర్శించారు. ప్లాంట్ లో కలియతిరిగి పనుల పురోగతి గురించి కంపెనీ ప్రతినిధులను విచారించారు.కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు సి ఇ ఒ ప్రవీణ్ ఆదిత్య, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ, రామాయపట్నం రాజశేఖర్, తహశీల్దార్లు, ఇతర అధికారులు ఉన్నారు.




కేక్ కట్ చేస్తున్న కంచర్ల విజయ్ శ్రీనివాస్

ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో న్యాక్ 'ఎ' గ్రేడ్ విజయోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు:

పకాశం ఇంజినీరింగ్ కాలేజీ రెండవ సైకిల్ న్యాక్ గుర్తింపులో 'ఎ' గ్రేడ్ సాధించిన సందర్భంగా కాలేజీలో శుక్రవారం ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కరస్పాండెంట్ డాక్టర్ కె. రామయ్య , టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ సిబ్బందిని అభినందించారు. ఈ విజయంతో కళాశాల విద్యా ప్రమాణాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, న్యాక్ 'ఎ' గ్రేడ్ సంస్థ నాణ్యతకు నిదర్శనం అని, ఇది ఒక మైలురాయి మాత్రమే, భవిష్యత్తులో మరింత మెరుగైన విద్యా ప్రమాణాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు.ప్రిన్సిపల్ డాక్టర్ సి. హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, ఈ విజయం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందుల సమిష్టి కృషి ఫలితమన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ డి విభాగం అధిపతి డాక్టర్ ఎం. లక్ష్మణ రావు, వైస్ ప్రిన్సిపల్ వి. హరి బాబు, అన్ని విభాగాల హెడ్‌లు జి.సురేష్ ఈ.సి.ఈ , ఎం.ఎం.రాయుడు సి.ఎస్.ఈ , డాక్టర్ మీరా షరీఫ్ ఈఈఈ , డాక్టర్ రాఘవ శర్మ సివిల్, డాక్టర్ జి.పున్నారావు మెకానికల్, డాక్టర్ కే.సుబ్బారెడ్డి ఆర్టిఫిషల్ అండ్ సైబర్, డాక్టర్ కే.పావని ఎంబిఎ డాక్టర్ షేక్.సూరియా ఎస్అండ్‌హె అధ్యాపకులు, అధ్యాపకేతరా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కలెక్టర్ కె.రాజు, కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-నెల్లూరు: ఏఐసీసీ పిలుపుమేరకు రాజ్యాంగ పరిరక్షణ సదస్సు సిడబ్ల్యుసి శాశ్వత సభ్యుడు కొప్పుల రాజు(రిటైర్డ్ ఐఏఎస్) ఆధ్వర్యంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమం ఇందిరా భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఇందిరాభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావని ని సమైక్యంగా ఉంచిన ఘనత రాజ్యాంగానిదే అన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని ప్రసాదించిన రాజ్యాంగ నిర్మాతలను అగౌరవంగా తూలనాడుతూ హేళనగా పార్లమెంట్లో మాట్లాడడం బిజెపి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగం లోని స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతత్వం కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని అన్ని వర్గాలపై ఉందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, దాని గొప్పతనాన్ని గ్రామ మండల స్థాయికి తీసుకువెళ్లేందుకు రాహుల్ గాంధీ ఈ ఏడాది పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారన్నారు. ఓ బి సి రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజు మాట్లాడుతూ దేశ సంపదంత కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమైందన్నారు.పేదరికం నిరక్షరాస్యత నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ 10 సంవత్సరాల ఎన్డీఏ పాలనలో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారని రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు మస్తాన్ వలి అన్నారు. డిసిసి అధ్యక్షుడు దేవకుమార్ రెడ్డి అధ్యక్షతన ఇందిరా భవన్ వన్ లో జరిగిన కార్యక్రమానికి విద్యార్థులు, యువకులు, సామాజికవేత్తలు, విద్యావేత్తలు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉడతా వెంకట్రావు , నాగరాజు ,యాదవ్, ఎం గోపాల్ రెడ్డి. నరసింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిడి బాబురావు

అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-లింగసముద్రం: కొలతల ప్రకారం పనులు చేస్తూ సమయపాలన పాటించాలని ఎపిడి. జె.బాబురావు చెప్పారు. శుక్రవారం మండలంలోని ఆర్ఆర్. పాలెం, లింగసముద్రం, మొగిలిచర్ల గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చేసే వేతనదారులతో మాట్లాడారు.కనీసం 4 గంటల పాటు పని చేయాలని, అధికంగా ఫారం పాండ్ పనులు చేయాలని తెలిపారు.అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎపిడి గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ పని కల్పించేలా చూడాలని, అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలన్నారు, నిబంధనల ప్రకారం పనులు చేయించాలని ఈ సమావేశంలో ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు, ఏపీఓ సమీర్ బాషా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

11న రాపూరు లో ప్రత్యేక విద్యుత్ అదాలత్


ప్రజాశక్తి-నెల్లూరు: ఈ నెల 11వ తేదీన రాపూరులో కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసెల్ ఫోరం (సి.జి.ఆర్.ఎఫ్) వారి ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించబడుతుందని నెల్లూరు రూరల్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.సోమశేఖర్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. నెల్లూరు రూరల్ డివిజన్ పరిధిలోని రాపూరు, నెల్లూరు రూరల్,పొదలకూరు, ముత్తుకూరు సబ్ డివిజన్ల పరిధిలోని 9 మండలాలు రాపూరు, సైదాపురం, పొదలకూరు, మనుబోలు, కలువాయు, నెల్లూరు రూరల్, ముత్తుకూరు, టి.పి. గూడూరు,వెంకటాచలం మండలాలు, సెక్షన్స్ రాపూరు, సైదాపురం, కలువాయు,మనుబోలు, ముత్తుకూరు, పొదలకూరు, కోడూరు, టి.పి.గూడూరు, వెంకటాచలం, విరువూరు, కావేరి నగర్, బుజ బుజ నెల్లూరు, నారాయణ రెడ్డి పేట సెక్షన్స్ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఉత్తరాన్ని చూపుతున్న అంగన్‌వాడీ నాయకులు

అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: అంగన్వాడీలను గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, అదే తీర్పులో 7వ పే కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని, దీనికి బడ్జెట్లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి అమలు చేయించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ వడ్డీతో సహా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నెల్లూరు జిల్లా అంగన్వాడీలు ఉత్తరాలు రాస్తున్నారని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం తెలిపారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఐ సి డి ఎస్ పథకాన్ని సంస్థాగతం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన పిల్లలకు రక్షణ పౌష్టిక ఆహారం అందించడం అందరూ చదువుకునే హక్కు, 6 సంవత్సరాల వరకు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్ కు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు కూడా తల్లికి వందనం, మధ్యాహ్నం పూట స్నాక్స్ అమలు చేయాలన్నారు. మహిళలు పనిచేస్తున్న ఐసిడిఎస్ ను బలోపేతం చేసి వర్కర్లను 3 తరగతి ఉద్యోగులుగా, హెల్పర్లను4 తరగతి ఉద్యోగులుగా గుర్తించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రపతి సిఫార్సు చేయాలన్నారు. అంగన్‌వాడీ మహిళలకు సరుకులన్నీ సకాలంలో అందించి ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులన్నీ ఇన్‌ఛార్జి సెంటర్లు గా కాకుండా పూర్తిగా భర్తీ చేసి, లబ్ధిదారులకు, సెంటర్లోని పిల్లలకు, అందరికీ న్యాయం చేయాలన్నారు. తమ సమస్యలను ఉత్తరాల రూపంలో కొరియర్ పోస్ట్ ద్వారా ఢిల్లీకి పంపించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆల్ ఇండియా పిలుపు మేరకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వై సుజాతమ్మ ,జిల్లా కార్యదర్శి షేక్ రెహానా బేగం, ఉపాధ్యక్షురాలు ఏ కామాక్షమ్మ ,జాయింట్ సెక్రటరీ ఎల్.వి శేషమ్మ ,జిల్లా కమిటీ సభ్యులు మల్లెమ్మ, రజని తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు తూమాటి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణ వరపర్లవారిపాలెం నివాసి రావూరి వెంకట రావు, అన్నపూర్ణ ల కుమార్తె వినీత, హరీష్ ల వివాహం కందుకూరు పట్టణం లోని వెంగమాంబ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఎంఎల్‌సి తూమాటి మాధవ రావు ఆశీర్వదించారు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నగరపాలక సంస్థ పరిధిలోని కార్పొరేషన్‌కు చెందిన రిజర్వ్ ఓపెన్ ఖాళీ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఆయా నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని కమిషనర్ సూర్య తేజ హెచ్చరించారు. స్థానిక 38వ డివిజన్ రమేష్ రెడ్డి నగర్, ఆచారి స్ట్రీట్, సి.ఎ.ఎం హై స్కూల్ పరిసర ప్రాంతాలలో కమిషనర్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణను శుక్రవారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ కు చెందిన రిజర్వ్ ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి మార్కింగ్ చేయమని సిటీ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రయివేటు స్థలాలను వాటి యజమానులే శుభ్రం చేసుకునేలా నోటీసులు జారీ చేసి వార్డ్ సచివాలయ అడ్మిన్, శానిటేషన్, ప్లానింగ్, అమెనిటీస్ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. వై.ఎం.సి.ఏ గ్రౌండ్ ఎదురుగా ఉన్న పంట కాలువను ఆక్రమిస్తూ నిర్మిస్తున్న నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని కమిషనర్ ఆదేశించారు.

అన్న క్యాంటీన్ సందర్శించిన కమిషనర్

అనంతరం ఏ.సీ. కూరగాయల మార్కెట్ అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు టోకెన్ విధానం ద్వారానే ఆహారాన్ని అందించాలని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు. టెక్కేమిట్టలోని పాత హెల్త్ ఆఫీసరు క్వార్టర్స్ శిధిలావస్థలో ఉన్నందున వెంటనే దాన్ని పగులకొట్టించాలని ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇని ఆదేశించారు. స్థానిక వార్డు సచివాలయ రెవెన్యూ కార్యదర్శి, వార్డ్ ప్లానింగ్ కార్యదర్శి విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ ,హెల్త్ ఆఫీసర్ డాక్టర్. చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్,ఈ.ఈ. శేషగిరిరావు, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

.కృష్ణపట్నం పోర్టులో శానిటేషన్ పై శిక్షణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : అదాని ఫౌండేషన్ కృష్ణపట్నం సైట్ లో శానిటేషన్ మేనే జ్‌మెంట్ అవేర్ నెస్ అండ్ ప్రాక్టీస్ పై శుక్రవారం శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. ముత్తుకూరు, కృష్ణపట్నం, తమ్మినపట్నం గ్రామ పంచాయతీల్లోని గ్రామస్తులు, మహిళలతో పాటు ప్రజా ప్రతి నిధులు, మత్స్యకారుల సంఘం నాయకులు గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు, అవగాహన కల్పించారు. అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పోలేరమ్మతల్లి మహిళా బృందం భాగస్వామ్యంతో అదాని ఫౌండేషన్ పైన పేర్కొన్న గ్రామాల్లో ఈ ప్రచారాన్ని అమలు చేస్తోంది. అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ పరిధిలోని గ్రామాలు ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, తిరుపతి జిల్లాలలో ఉన్నాయి. సుమారు 100 మంది ఈ కార్యక్రమంలో ఉన్నారు. ఈ సందర్భంగా అదానీ ఫౌం డేషన్ సీనియర్ పిఓ డాక్టర్ సిహెచ్ రమేష్ బాబు మా ట్లాడుతూ ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ విలువైన మార్గదర్శకత్వం, నాయక త్వంలో అదాని ఫౌండేషన్, ఆరోగ్యకంమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి సంబంధించి గ్రామస్తులను చైతన్యపరచడానికి పరిశుభ్రమైన గ్రామం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి కట్టు బడి ఉందన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

ప్రజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని ప్రచారం చేస్తున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న ప్రజల ఆలోచనలో మార్పు తీసుకువచ్చేందుకు కమిషనర్ సూర్య తేజ వినూత్నంగా ఆలోచించారు. స్థానిక 48వ డివిజన్ విరాట్ నగర్, వి.బి.ఎస్. కళ్యాణ మండపం సమీపం లో,54 వ డివిజన్ వెంకటేశ్వరపురం, కరెంటు ఆఫీసు సెంటర్ వివిధ ప్రాంతాలలో బహిరంగ ప్రదేశంలో వ్యర్థాలు వేయవద్దని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసి ఉన్నప్పటికీ, స్థానికులు పెడచెవిన పెట్టారని తెలిపారు. ప్రజల ఆలోచనల్లో మార్పు తీసుకు రావాలని నిర్ణయించి, వ్యర్థాలు వేస్తున్న ఆ ప్రదేశాన్ని పారిశుధ్య కార్మికుల ద్వారా శుక్రవారం నీళ్లతో శుభ్రం చేసి, ముగ్గులు వేశారు.

హైస్కూల్ అప్‌గ్రేడ్ చేయాలని ఆందోళన


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలోని దాసరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్ అప్ గ్రేడ్ చేయాలంటూ శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యా శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ 8వ తరగతి వరకు పాఠశాల కొనసాగుతుండగా ప్రస్తుతం ప్రభుత్వం పాఠశాలను 5వ తరగతి వరకు కొనసాగించాలన్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్ నిలుపుకోవడానికి విద్యార్థుల కొరత రాబోయే అకాడమీకి సంవత్సరానికి పూర్తి చేసుకుంటామని ఉపాధ్యాయులుగా గ్రామస్తులుగా చైర్మన్‌గా విద్యాశాఖ అధికారికి హామీనిచ్చారు. ఇంతటి వరకు 8వ తరగతి వరకు ఆగే ముస్లిం మైనార్టీ మహిళా విద్యార్థులు కనీసం 10వ తరగతి చదివే వరకు తమ గ్రామంలోని హైస్కూల్ ఏర్పాటు చేయాలని లేకపోతే చదువులకు దూరం అవుతారని కోరారు. అనంతరం ఎంఇఒ-1 షేక్.మస్తాన్‌వలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ గౌస్ మొహిద్దీన్, మాజీ సర్పంచ్ జుమ్రుద్ బేగం జాఫర్ మొహిద్దీన్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జిలాని గౌస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు ప్రారంభం



ప్రజాశక్తి-కొడవలూరు : మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో నిర్మించిన సిసి రోడ్లను శుక్రవారం ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షాదీ మందిర్‌ను గవర్న మెంట్ హాస్పిటల్ ను అగ్రికల్చర్ కార్యాలయంను పరిశీలించారు. షాదీ మందిర్‌కు రూ.10లక్షలు, వ్యవసాయ అగ్రికల్చర్ కార్యాలయానికి రూ.5 లక్షలు, ఇపిఆర్ ఫౌండేషన్ ద్వారా నిధులను అందించి వాటి అభివృద్ధికి కృషి చేస్తామని హామీనిచ్చారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో అభివృద్ధి పనులు కోసం ఎంపి ల్యాండ్స్ నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కొడవలూరులో రూ.6.5కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినటుల తెలిపారు. నియోజకవర్గానికి వచ్చిన పనులను ప్రతి పంచాయతీలోని స్థానిక నాయకులకు అప్పజెప్పి నాణ్యత లోపించకుండా పనులను చేయించటం జరుగుతుందన్నారు. ప్రజలు హౌసింగ్ ఇళ్లల కోసం, ఇళ్ల స్థలాల కోసం సచివాలయంలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీహరిరెడ్డి, టిడిపి నాయకులు మందిపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జీవీయన్ శేఖర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పంది శ్రీనివాసులు, రమణయ్య, వెంకీ, పాటూరు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో తలనీలాలు వేలం

- ఆదాయం రూ.2,30,10000

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి తలనీలాలు వేలం పాటలు ద్వారా రూ.2,30,10,000 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి.సాగర్ బాబు తెలిపారు.మాలకొండ కళ్యాణ మండపంలో కందుకూరు శివాలయం కార్యనిర్వహణాధికారి రవీంద్రనాద్ పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటలు జరిగాయి. తలనీలాలు వేలం పాట గత ఏడాది కంటే ఈ ఏడాది పెరిగింది. గతేడాది కోటి 50లక్షలు ఉన్న తలనీలాలు వేలంపాట రూ. 2,30,10000కు పెరిగింది. మిగిలిన కొబ్బరిచిప్పలు, కొబ్బరికాయలు, పాలు, పెరుగు నెయ్యి, వాహన పార్కింగ్, పూజాద్రవ్యాలు, చీరలు, రవికలు, బొమ్మల అంగళ్లు, కూల్‌డ్రింక్స్, ఫలహారసాల పాదరక్షలు పాటలు సరైన పాటలు రానందున ఆలయ అధికారుల వాయిదా వేశారు. వేలం పాటలు నిర్వహణలో పాటదారులు రెండు గ్రూపులుగా విడిపోయారు. అందులోని ఓ గ్రూపు పాటదారులు ఆలయ అధికారుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది.

ప్రభుత్వ శాఖల ద్వారానే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి-కందుకూరు : ప్రయివేటు ఏజెన్సీలకు అప్పజెప్పాలనే రాష్ట్ర కేబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించాలి సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ డిమాండ్ చేశారు.ప్రభుత్వ శాఖలు,వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియమకాలన్నీ ప్రైవేటు ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలని నిన్న రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం చేయడాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు ఏజెన్సీల ద్వారా నియమకాలు జరిగితే పారదర్శకత లోపించి, నిజమైన మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ సంస్థ ద్వారా ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రైవేటు ఏజెన్సీలకు అవుట్సోర్సింగ్ నియమాకాలను అప్పజెప్పితే పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించినట్లయితే కాంట్రాక్టు ఉద్యోగులం దరిని సమీకరించి ఆందోళన చేయడానికి వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని పలు పట్టణాల్లో పిఎంఎవై 2.0 సర్వే కొనసాగుతుందని హౌసింగ్ పిడి వేణుగోపాల్‌రావు అన్నారు. కోవూరులోని గృహ నిర్మాణ శాఖ డిఇ కార్యాలయంలో శుక్రవారం ఆయన హౌసింగ్ నిర్మాణాలపై సంబంధిత ఎఇలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఎవై 2.0 కింద నెల్లూరు జిల్లాకు 2930 గృహాలు మొదటి ఫేస్‌లో ఎంపికయ్యాయన్నారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ డిఇ మధుసూదన్ రెడ్డి, ఎఇ జిలాని, ఎఇలు మాధవరావు, కౌసి పెంచలయ్య, తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా చిన్నతరహా గణన చేపట్టాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలో త్వరలో చేపట్టనున్న 7వ చిన్న తరహా గణన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత గ్రామాల్లోని విఆర్‌ఒలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్టాటికల్ అధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన విఆర్‌ఒలతో 7వ చిన్న తరహా గణన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నిర్మలానంద బాబా ఉన్నారు.

రుణాల రికవరీపై దృష్టి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో స్త్రీనిధి, ఉన్నతి ఇతర బ్యాంకుల ద్వారా పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాల రికవరీపై విఒఎలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎపిఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన విఒఎలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సంఘమిత్ర అధ్యక్షురాలు లాస్య, సిసిలు రాజశేఖర్, చైతన్యబాబు, రామం, శోభ, తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలో ఎపిపి నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పనులను శుక్రవారం ఎంపిపి మూలె పద్మజ వినయ్ రెడ్డి, ఎంపిడిఒ అప్పాజీ గుత్తేదారుడుతో కలిసి చేసిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మండల గ్రాంట్ కింద రూ.3లక్షలతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వెనుక వైపు నుండి సాధన స్కూల్ వరకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ పనుల నాణ్యతను పరిశీలించారు. నాణ్యతతో చేపట్టాల్సిన పనులను పూర్తి చేసిన పనులను అప్పగించాలని గుత్తేదారులకు వారు పలు సూచనలు చేశారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని సోమేశ్వరపురం గ్రామంలో శుక్రవారం జరిగిన శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి విగ్రహ శిలా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి విచ్చేశారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠ కార్యక్రమం దాతలు బచ్చు కృష్ణ కుమార్ - బచ్చు సంధ్యా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అభినందించారు. అమర బచ్చు చాటింబులు (బట్ట) ఉద్యోగంలో వీరు చేస్తున్న సేవలు మరువలేనివి కొనియాడారు. ఇక్కడ అమర అశోకా ద్వారా తమ్ముడు చేస్తున్న సేవ అద్భుతమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతినెలా 'స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి-కోవూరు : జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీలు ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు. కోవూరు పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు సేఫ్టీ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత తెలిపారు. శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వింజమూరు సబ్ ఇన్స్పెక్టర్ పి.నరేష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఇ. ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై ఆందోళన


మర్రిపాడులో..


అనంతసాగరంలో..

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోనిపిచిరికుంటలో ప్రాథమిక పాఠశాలను తరలించేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడంపై గ్రామస్తులు మండల విద్యావనరుల కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిచిరికుంటలో 1954 నుండి ప్రాథమిక పాఠశాల ఉండగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలను, బిసి కాలనీలోని పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. మెయిన్ పాఠశాల ఇక్కడే ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు ఎంఇఒ-2 ధనలక్ష్మి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో వినతిపత్రం ఇచ్చేందుకు విద్యాధికారుల కార్యాలయానికి వెళ్లగా ఎంఇఒ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిపై ఉన్నతాధికారులు స్పందించి మెయిన్ పాఠశాలను బిసి కాలనీ పాఠశాలలో విలీనం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పాఠశాల చైర్మన్ సుజాత, ఉప చైర్మన్ శిరీష, గ్రామ ఉప సర్పంచ్ భారతి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ తరలించొద్దని ఆందోళన

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని ముస్తాపురంలో ఉన్న ఉర్దూ మీడియం స్కూల్‌ను తరలించవద్దని స్థానికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా స్కూల్లో పిల్లలకు చక్కగా ఉర్దూను బోధిస్తు ఉన్నారని, కాబట్టి తమ పిల్లలను ప్రయివేటు స్కూల్స్‌కు పంపించకుండా ఉర్దూ మీడియం స్కూల్‌లోనే చదివిస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జిఒ 117 ద్వారా క్రమంలో మోడల్ స్కూల్లో ఉర్దూ మీడియం స్కూళ్లను విలీనం చేసే క్రమంలో తమ గ్రామంలో ఉండే ఉర్దూ మీడియం స్కూల్‌ను తరలించొద్దని వేడుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బందేఖాన్, కరీం మొహిద్దీన్, రిజ్వన, షంషాద్, జమిల, నాగుర్ సాహెబ్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులకు గండి


ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్థి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

వక్ఫ్‌బోర్డ్ అధీనంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఎఎస్‌పేట దర్గాకు సంబంధించిన ఆస్తులకు గండి కొడుతున్నారని మండల సిపిఎం కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ శ్రీ శ్రీ ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ దర్గా ఎఎస్‌పేటలో ఉందని, ఈ దర్గాకు సంబంధించిన ఆస్తులైన, దర్గా సమీపంలోని వివిధ ప్రదేశాలలో, మొత్తం నాలుగు రూములను, దర్గాకు సంబంధం లేని కొంతమంది వ్యక్తులు, వారి ఆధీనంలో ఉంచుకొని, గత 30 నెలలుగా వాటికి వచ్చే బాడుగలు సుమారు నెలకు రూ.80వేలను వారే దండుకుని, వాడుకుంటున్నారని, దర్గా ఆదాయానికి గండి కొడుతున్నారని వాపోయారు. అదే విషయాన్ని దర్గా ఇఒ మహమ్మద్ హుస్సేన్‌తో ఫోన్‌లైన్‌లో సంప్రదించగా అది నిజమేనని, వారు ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారన్నారు. నాలుగు రూములను, తమకు తిరుగు ఇవ్వాల్సిందేనని ఇదివరకే రెండు నోటీసులను జారీ చేశామని, వారు ఎలాంటి సమాధానం తెలియజేయలేదని, మూడో నోటీసును జారీ చేస్తున్నామని, ఫిబ్రవరి 11వ తేదీన దానిపై విచారణ చేసి, తదుపరి వక్ఫ్‌బోర్డ్ ఆధీనంలోకి తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న ఎంఎల్‌ఎ సురేష్

ప్రజాశక్తి-కలిగిరి

రేపటి కాలానికి ముందడుగు నేటి బాలలేనని, మీరందరూ శ్రద్ధగా చదివి లక్ష్యాన్ని చేధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చని ఎంఎలఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎపి మోడల్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన 12వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ముందుగా ఘన స్వాగతం పలికారు. అనంతరం భరత నాట్యంతో విద్యార్థులను అధ్యాపకులను, ముఖ్య అతిథులను అబ్బురపరిచారు. అనం తరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ ఎపి మోడల్ స్కూల్స్ ఆదర్శ పాఠశాలలు, నవోదయ లాంటి ఎన్నో ఉత్తమ విద్యలను అందించే స్కూళ్లను నెలకొల్పడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి పంచాయతీ పరిధిలో ఎలిమెంటరీ స్కూల్, హై స్కూళ్లను ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందిస్తున్నారు.అనంతరం ఎపి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధాన రహదారి నుండి స్కూలు ప్రాంగణంలో భవనాల వరకు సిసి రోడ్డు కావాలని ఎంఎల్‌ఎను అడిగిందే తడవుగా వెంటనే సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారని, ఇటువంటి ఎంఎల్‌ఎ ఉండడం అదృష్టం అంటూ విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం తరపున ఎంఎల్‌ఎకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు ఎంతో ఆనందంగా ఎంఎల్‌ఎతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. గత సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, భాషిం నరసింహులు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, బొల్లినేని రామారావు, ఉసా మాల్యాద్రి, చీమల తాతయ్య, ఇతర నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఎస్.ఆర్.శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


విద్యార్థులకు పరీక్షసామగ్రి అందజేస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-కావలి

ప్రతి విద్యార్థి దివంగత, విశ్రాంత కలెక్టర్ ఎస్.ఆర్.శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకొని చదవాలని ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వెంగళ రావునగర్‌లో ఉన్న ప్రభుత్వ బి.సి. బాలుర వసతి గృహం-1లో ఎస్ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వసతి గృహ అధికారులు ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఎల్‌ఎ రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వాలన చేసి రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. శ్రీ మేధా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పి.జానకిరామ్ వితరణ చేసిన 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. హాస్టల్లో ఉన్న మరుగుదొడ్లకు డోర్లు లేవని, వార్డెన్ ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వంతో పని లేకుండా తనసొంత నిధులతో డోర్లు నిర్మిస్తానని ఎంఎల్‌ఎ వారికి హామీనిచ్చారు. అనంతరం ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి కూడా తమ తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి ఒక లక్ష్యంతో కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే తల్లిదండ్రులు, గురువులు సంతోషం వ్యక్తం చేస్తారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు అన్నివిధాల టెక్నాలజీతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. తాను కూడా ఒక నిరుపేద కుటుంబానికి చెందిన వాడినని, నేలపై కూర్చొని, తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి ఇష్టంతో చదివాను కాబట్టి ఈరోజు కావలి ఎంఎల్‌ఎగా సేవ చేసుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో సహాయ బిసి సంక్షేమాధికారి ఎం.రవికుమార్, హెచ్‌డబ్ల్యూఒలు బండి.కోటిచలపతిరావు, జయరామయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి ఆలేఖ్య, 26వ ఇన్‌ఛార్జ్ గంగినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్.సి.నాయకులు కాకి ప్రసాదరావు, 19వ ఇన్‌ఛార్జి ఎగూరి చంద్రశేఖర్, టిడిపి నాయకులు తీరువీధి ప్రసాద్, ఇస్కు విక్రమ్ రెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు నాయుడు, అలా శ్రీనివాసులు, షేక్.బాషా, విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి షేక్.ఖాదర్ బాషా, కె.సుధాకర్, విశ్రాంత సహాయ బిసి సంక్షేమాధికారి కె.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి 'యానాది శెట్టి'



ప్రజాశక్తి-కావలి : కావలి అభివృద్ధి కోసం ప్రతీక్షణం పరితపించి, తన జీవితాంతం ప్రజా సేవలోనే గడిపిన మహోన్నత వ్యక్తి గ్రంధి యానాదిశెట్టి అని ఆయన కావలి అభివృద్ధి కోసం చేసిన కృషిని కావలి ప్రజలు ఎన్నడూ మరువరని ఎంఎల్‌ఎ దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో ఉన్న మాజీ ఎంఎల్‌ఎ మాగుంట పార్వతమ్మ ట్రంక్ రోడ్డులో దివంగత గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో యానాదిశెట్టి కుమార్తె పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ కిషోర్ బాబు, జ్యోతి బాబురావు, పోతుగంటి శ్రీకాంత్, తటవర్తి వాసు, హాజరత్, షేక్.మస్తాన్, బచ్చు వీరాస్వామి, సి.వి.సి.సత్యం, జనసేన నాయకులు సమ్మను వెంకటసుబ్బయ్య, పొబ్బాసాయి విఠల్, తోకల నరసింహారావు, టిడిపి, జనసేన, నాయకులు, కార్యకర్తలు, గ్రంధి అభిమానులు పాల్గొన్నారు.

రమాబాయి జయంతి వేడుకలు



ప్రజాశక్తి-కావలి : మాతా రమాబాయి జయంతి వేడుకలు ఉపాసికుల సంగీతి కార్యక్రమం శుక్రవారం అంబేద్కర్ బుద్ధవిహార్‌లో ఘనంగా నిర్వహించారు. మాతా రమాబాయి గొప్పతనం గురించి అందరూ కొనియాడారు. అంబేద్కర్ గొప్ప చదువులు చదివారంటే దాని వెనుక రమాబాయి త్యాగం ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి జ్యోతి అధ్యక్షత వహించగా సహాయకులు గా పూజల మమత, ప్రసన్న, గోనీ. శ్రీనివాసులు సతీమణి ఉన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిలుగా గుర్రప్ప (రిటైర్డ్‌జడ్జీ), గోవిందయ్య (కావలి ఎంఇఒ), ఆరవ రాయప్ప (బుద్దిష్ట్) దాసరి సుందరం (బుద్దిష్ట్), మాలకొండ రెడ్డి (సోషల్ వర్కర్) అంబటి కొండలరావు (జైభీమ్ జెఎసి అధ్యక్షులు) పూజల జయప్రకాష్ (అంబేద్కర్ బుద్దవిహార్) మరిపూడిమాచర్ల (అంబేద్కర్ బుద్ధవిహార్), ఉదయ్ భాస్కర్ (అంబేద్కర్ బుద్ధవిహార్), వెంకటేశ్వర్లు (లాయర్), మేడికొండ సుకుమార్, గోపి, కుడారీ మస్తాన్(బిసిఎం), సింహాద్రి (భవానీ ఎడ్యుకేషన్ డైరెక్టర్) కనపర్తి సింహాద్రి .దేశయ్య, విజయ్ (స్టూడియో) బుద్ధ విహార్ స్టాఫ్ బౌద్ధ చార్యులు సంఘ జ్యోతి, కావలి జీవన్, చిడితోటి వంశీ, ధన్యాసి మధన్, జ్యోతిసన్నీ, కృష్ణ, విహార్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఎఎన్ఎం జమాయమ్మకు సన్మానం



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిరుమలాపురం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఎంపిహెచ్ ఎఎన్ఎంగా పనిచేస్తున్న జమాయమ్మకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారిని వి.సుజాత చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని తోటి సిబ్బంది గ్రామస్తులు శాలువా పూలమాలతో శుక్రవారం ఘనంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మన్సూర్ ఆలీ, బ్రహ్మారెడ్డి, ముజీబ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను సకాలంలో నిర్మించాలి


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ఎన్నోయేళ్లుగా కలలు కంటున్న మార్కెట్ వ్యాపారస్తులకు ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో నూతన మార్కెట్ కాంప్లెక్స్‌ను పూర్తి చేసి వ్యాపారస్తులకు అందించాలని తేజు డెవలపర్స్‌ను ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. బుచ్చిరెడ్డి పాలెం పట్టణం నూతన మార్కెట్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమంలో శుక్రవారం ఎంఎల్‌ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లోని వ్యాపారస్తులకు కోరిక మేరకు శిథిలా వస్థలో ఉన్న పాత భవనాన్ని తొలగించి రూ.2కోట్ల వ్యయంతో నూతన మార్కెట్ కాంప్లెక్స్‌ను తేజు డెవలపర్స్ వారి సహకారంతో వ్యాపారస్తులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కాంప్లెక్స్‌లో సుమారు 60 షాపులు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. మార్కెట్ కాంప్లెక్స్ పూర్తయిన అనంతరం వ్యాపారస్తులకే కాకుండా కొందరికి జీవనోపాధి లభిస్తుందన్నారు. బుచ్చిరెడ్డి పాలెం పట్టణాన్ని మరింత అభివద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి తమ సిఎస్ఆర్ నిధులు మంజూరు చేసినందుకు తేజు డెవలపర్స్ వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ సహకార సిఆర్‌సి, ఆలింకో వారి సహకారంతో వికలాంగులను గుర్తించి వారికి బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, తగు ఉపకరణాలు ఆమె అందజేశారు. సమాజంలో వికలాంగులు గౌరవప్రద మైన జీవితం గడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.3వేలు ఉన్న పెన్షన్‌ను రూ.6వేలకు పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, వైస్ చైర్‌పర్సన్ పటాన్ నస్రీం, శివకుమార్ రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, అర్బన్, రూరల్ అధ్యక్షులు ఎం.వి.శేషయ్య, బత్తల హరికృష్ణ, సూరా శ్రీనివాసులు రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-కావలి

కర్నూల్‌లో ఏర్పాటు చేస్తున్న హైకోర్టు పర్మినెంట్ బెంచ్‌కు సంబంధించి నెల్లూరు, ప్రకాశం జిల్లాలను కూడా ఆ కోర్టు పరిధిలోకి తీసుకు రావడానికి వ్యతిరేకంగా శుక్రవారం కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కావలి న్యాయవాదులందరూ కావలిలోని అన్ని కోర్టుల విధులను బహిష్కరించి తమ నిరసనను తెలియజేశారు. అలాగే శుక్రవారం బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు మాట్లాడుతూ కర్నూల్‌లో ఏర్పాటు చేస్తున్న హైకోర్టు పర్మనెంట్ బెంచ్‌ను ఏర్పాటు చేయడం మంచిశుభ పరిణామమే కానీ నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని అన్ని కోర్టులను కర్నూలు ఏర్పాటు చేసే హైకోర్టు బెంచ్ పరిధిలోకి తీసుకురావడం చాలా అన్యాయమని పేర్కొన్నారు. అలాగే కావలి నుండి అమరావతిలోని హైకోర్టుకు మూడు గంటలలో చేరుకోవచ్చని, కానీ కర్నూలుకు వెళ్లాలంటే కావలి నుండి సరైన రవాణా సౌకర్యం లేదన్నారు. దానివల్ల న్యాయవాదులు కక్షదారులు చాలా ఇబ్బందులకు గురవుతారని తెలియజేశారు. సమావేశంలో న్యాయవాదులందరూ ముక్తకంఠతో ఖండించారు. అలాగే కావలి బార్ అసోసియేషన్ తరపున రిప్రజెంటేషన్ కూడా తయారు చేసి, కావలి ఎంఎల్‌ఎకు, అలాగే నెల్లూరు జిల్లా ఎంపికి, అలాగే నెల్లూరు జిల్లాలో ఉండే మినిస్టర్లకు, న్యాయశాఖ మంత్రికి న్యాయశాఖ కార్యదర్శికి, ముఖ్యమంత్రికి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, హైకోర్టు రిజిస్టర్ జనరల్‌కు రిప్రజెంటేషన్ ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మిట్టసల జయప్రకాష్, సీనియర్ న్యాయవాదులు కలికి శ్రీనివాసులు రెడ్డి, ఎం.బాబు, మద్దాల బాబురావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎస్.వి.రాజేంద్ర ప్రసాద్, టి.మల్లికార్జునరావు, ఎ.శ్రీనివాసులు, పి.వి.రమణారెడ్డి, వంటేరు లక్ష్మీనారాయణ రెడ్డి, మహిళా న్యాయవాదులు విజయలక్ష్మి, నిరీక్షణ, జ్యోతి, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు మెగా టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వింజమూరు

నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించి యుటిఎఫ్ మెగా టాలెంట్ టెస్ట్‌ను వింజమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జి.చెంచల బాబు ప్రకటనలో తెలియజేశారు. కావున నియోజకవర్గ పరిధిలోని పదవ తరగతి విద్యార్థులందరూ ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని బహుమతులను పొందాలని కోరారు.



న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి

హైకోర్టు ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ సూచనల మేరకు కావలి టౌన్ శివార్లలోని ఇటుకల బట్టీల దగ్గర శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బాల్య వివాహాలు వాటి పరిణామాలు, నిరక్షరాస్యత, వెట్టిచాకిరి నిర్మూలన చట్టం, బాల కార్మిక నిర్మూలన చట్టం, కార్మికులకు ఉన్న చట్టాలు, మొదలైన చట్టాలపై అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలను బాగా చదివించి, ఉన్నత శిఖరాలకు పంపించాలన్నారు. లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయిప్రసాద్, పియల్‌వి అశోక్, లోక్‌అదాలత్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

వివిధ స్వీట్ దుకాణదారులు, చిప్స్ దుకాణదారులు ఆహార భద్రతా నియమాలను పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారిణి నీరజ అన్నారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాలెంలోని పలు బిస్కెట్లు తయారీ దుకాణాలు, చిప్స్ తయారీ దుకాణాలను శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో అనుమానాస్పదంగా కనిపించిన వస్తువులను సీజ్ చేసి ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. ఆమెవెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కోవూరు : సామాజిక ఆరోగ్య కేంద్రానికి కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన కాటంరెడ్డి రంగారెడ్డి మనవడు, కోదండ రామస్వామి ఆలయ పునఃనిర్మాణ దాత రాటంరెడ్డి కృష్ణారెడ్డిని శుక్రవారం కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు విషయాలను ఆయనతో చర్చించారు. తమవంతుగా అస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తమ తండ్రి జ్ఞాపకార్థం ఆస్పత్రిలో వైద్యుల కోసం ఒక ప్రత్యేక గది కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని కృష్ణారెడ్డి వారికి సూచించారు. అనంతరం కృష్ణారెడ్డిని పూలమొక్కతో అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ ఉన్నారు.

అభివృద్ధి పనులు పునఃప్రారంభం


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

పదేళ్ల అనంతరం ఆత్మకూరులో అభివృద్ధి పనులను పునఃప్రారంభిస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పునరుద్ఘాటించారు. శుక్రవారం పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 9న ఆత్మకూరులో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు మంత్రులు పొంగూరు నారాయణ, ఫరూక్, సవిత, బిసి జనార్దన్ రెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి స్వయంగా పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరులో గత పదేళ్లుగా అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని, మళ్లీ తన హయాంలో ఆత్మకూరు అభివద్ధి పనులను పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 9వతేదీ ఉదయం 10 గంటలకు ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో రామాలయం నిర్మాణం శంకుస్థాపనతో అభివృద్ధికి తిరిగి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని టిడ్కో కాలనీల్లో రామాలయాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి అనుమతులు మంజూరు చేశారని, ఈ మేరకు రూ.20 నుంచి రూ.25లక్షలతో మొట్టమొదటి రామాలయ నిర్మాణానికి ఆత్మకూరు పట్టణంలో శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు పట్టణానికి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహాత్మ జ్యోతిరావు పూలే బిసి బాలికల గురుకుల పాఠశాలను పాలిటెక్నిక్ కళాశాలలో తాత్కాలికంగా ప్రారంభిస్తున్నామన్నారు. ఈ ఏడాది బడ్జెట్లో ఈ పాఠశాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.1.70కోట్లతో పంచాయతీరాజ్ అతిథి గృహానికి శంకుస్థాపన, ఆధునికరించిన ఆర్‌అండ్‌బి అతిథి గృహం ప్రారంభోత్సవం కార్యక్రమా లను కూడా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. 2019-2014 మధ్య ఆత్మకూరు అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించానని, నాడు మొదలుపెట్టినవి నేడు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. దీర్ఘకాలిక అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రూ.30 కోట్లతో రోడ్లు గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో కనీసం 10శాతం కూడా జల్జీవన్ మిషన్ పనులు జరగలేదని, తమ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు జల్జీవన్ మిషన్ పథకం కింద రూ.8840 కోట్ల అంజనాలతో పనులు చేపడుతుండగా, ఆత్మకూరు నియోజక వర్గానికి రూ.580 కోట్లు నిధులతో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి ఏర్పాటుచేసి స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేస్తామన్నారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గంలోని 21మంది లబ్ధిదారులకు రూ.19.42 లక్షలు విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, ఆర్‌డిఒ పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, టిడ్కో ఆర్‌అండ్‌బిఎస్ఇలు అశోక్ కుమార్, వెంకటరమణ, మహేష్, గంగాధర్, జిల్లా బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, నాయకులు బొల్లినేని గిరినాయుడు, ధనుంజయ రెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి, కేశవ చౌదరి, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్లపై హర్షం



ప్రజాశక్తి-ఉదయగిరి

ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల్లో బిసిలకు 24శాతం నుంచి 34శాతానికి రిజర్వేషన్లు పెంచి కేబినెట్ ఆమోదించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్‌కు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బిసిల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి సుమారు 17వేల మంది బలహీనత ఉన్న వారికి స్థానిక సంస్థలలో రాజ్యాంగబద్ధంగా రావాల్సిన పదవులు రాకుండా బిసిలను మోసం చేశారన్నారు. పాదయాత్ర సందర్భంగా రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు బిసిలకు అన్ని రంగాలలో 34శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత నారా లోకేష్ బాబుకు దక్కుతుందన్నారు. టిటిడి ఇఒగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా డిజిపిగా అనేక ఉన్నత పదవులను బిసిలకు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి యువ నాయకులు నారా లోకేష్‌కు దక్కిందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు బిసిల తరపున తెలిపారు.

CHANGE OF NAME

I, TALAMADUPULA KHAJA RAHAMATULLA (Old Name), Resident at D.No. 25-3-1201, 11th Street, Pragathi Nagar, Nellore - 524003, SPSR Nellore Dt, AP. here by declare that I have changed my name as TALAMADUPULA KHAJA RAHAMTHULLA (New Name) S/o. TALAMADUPULA HAZARAT.